సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 127 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



క్రమశిక్షణతో పనిచేయాలి

హోంగార్డులు క్రమశిక్షణతో పనిచేయాలని రాయలసీమ రీజినల్ హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన పుట్టపర్తి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల పరేడ్‌ను పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.9°/22.5°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జడితో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సజావుగా పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జిల్లాలో సజావుగా సాగింది. 1వ తేదీ ఆదివారం రావడంతో కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందే 31వ తేదీ శనివారమే లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందేలా ఏర్పాట్లు చేసింది. సెప్టెంబర్ నెలకు సంబంధించి జిల్లాలోని 2,68,079 మందికి ప్రభుత్వం రూ.115.07 కోట్లు విడుదల చేసింది. దీంతో 9,551 మంది సచివాలయ ఉద్యోగులు శనివారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సాయంత్రానికి 2,52,613 మందికి రూ.108.38 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేశారు. తక్కిన వారికి సోమవారం అందజేయనున్నారు. కలెక్టర్ చేతన్ ఉదయమే కొత్తచెరువులో పింఛన్ పంపిణీని పర్యవేక్షించారు. కొందరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేశారు.

ఇసుక రీచ్ పనులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



చిన్నచిగుళ్లరేవులో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

తాడిమర్రి: చిత్రావతి నది పరీవాహక ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఇసుక రీచ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని ఆదేశించారు. శనివారం ఆయన మైనింగ్ ఏడీ రామ్మోహన్‌రావు, ఈఈ రాజశేఖర్, ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డితో కలసి మండలంలోని చిన్నచిగుళ్లరేవు సమీపంలోని చిత్రావతి నదిలో ఏర్పాటు చేయనున్న ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, నదిలోని నాణ్యమైన ఇసుకను వెలికి తీసి నది వెలుపల డంప్ చేయాలన్నారు. అలాగే ప్రధాన రహదారి నుంచి ఇసుక రీచ్ వరకు రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీ శ్రీనివాసులును ఆదేశించారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జేసీ వెంట తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన

ముదిగుబ్బ: మండలంలోని బూదనాంపల్లి వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను శనివారం జేసీ అభిషేక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రీచ్ వద్ద పార్కింగ్ సౌకర్యం కోసం స్థల పరిశీలన చేశారు. ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చిన్నారిపై కోతి దాడి



కోతి దాడిలో గాయపడిన చిన్నారి

హిందూపురం టౌన్: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో శనివారం మూడు నెలల చిన్నారిపై కోతి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పరిగి మండల కేంద్రానికి చెందిన సిగ్బతుల్లా పని నిమిత్తం తన మూడు నెలల కుమార్తెతో కలసి హిందూపురంలోని త్యాగరాజనగర్‌కు వచ్చారు. అక్కడే చిన్నారిని ఎత్తుకుని ఉండగా.. కోతి ఒక్కసారిగా దాడి చేసింది. చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం చిన్నారిని అనంతపురానికి రెఫర్ చేశారు.

రైతు దుర్మరణం

నల్లమాడ: రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంకరకుంట గ్రామానికి చెందిన రైతు ఇడుగూరి రమణారెడ్డి (53)శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో సోదరుడితో కలిసి నల్లచెరువు మండలం పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి దర్శనానికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చారుపల్లి సమీపానికి రాగానే రోడ్డు మలుపులో ఎదురుగా వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొంది. బైక్ నడుపుతున్న రమణారెడ్డి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సోదరుడు గాయాలతో బయటపడ్డాడు. రమణారెడ్డికి భార్య లక్ష్మీదేవి, కుమారులు అమర్నాథరెడ్డి, రాజేష్‌రెడ్డి ఉన్నారు.

రియల్.. కుదేల్!

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే బుక్కపట్నానికి చెందిన ఓ యువకుడు, హిందూపురానికి చెందిన తన సహోద్యోగిని వివాహం చేసుకున్నాడు. దంపతులిద్దరూ ఉద్యోగాలు చేయడంతో ఎక్కడైనా ప్లాట్ కొనాలని భావించారు. అబ్బాయి తరపు వారు జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కొనాలని సలహా ఇవ్వగా, త్వరలోనే హిందూపురం జిల్లా కేంద్రం అవుతుందని అందువల్ల అక్కడ కొంటే మేలని అమ్మాయి తరపు వారు తెలిపారు. ఏం చేయాలో తెలియని ఆ దంపతులు నేటికీ ఎక్కడా స్థలం తీసుకోలేకపోయారు.

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు కాగానే ఓడీసీకి చెందిన ఓ యువకుడు పుట్టపర్తి సమీపంలో రూ.లక్షలు వెచ్చించి 5 సెంట్ల స్థలం కొన్నాడు. ఇటీవల డబ్బు అవసరం కాగా ఆ స్థలాన్ని విక్రయించాలనుకున్నాడు. కానీ కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఆరా తీస్తే జిల్లా కేంద్రం తరలిపోతుందని ఒకరు...ఇక్కడకొంటే ఆ నేతతో ఇబ్బందే అంటూ మరొకరు వెనక్కి వెళ్లిపోయారు.

...జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రస్తుత పరిస్థితి ఇది. జిల్లా కేంద్రం హిందూపురానికి తరలిస్తామని బాలకృష్ణ చెప్పడంతో పుట్టపర్తిలో స్థలం కొనేవారు కరువయ్యారు. ఇక మిగతా ప్రాంతాల్లో కూటమి నేతల దాడులతో భూములు కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

- శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుతో భూముల ధరలకు రెక్కలు
- జిల్లా వ్యాప్తంగా బాగా పెరిగిన 'రియల్' వ్యాపారం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అంతా తారుమారు
- బాలకృష్ణ జిల్లా కేంద్రం మార్పు ప్రకటనతో మరింత గందరగోళం
- మైనస్‌లో తొమ్మిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల గ్రోత్ రేటు
- నిర్ణయించిన లక్ష్యంలో 20 శాతం కూడా రెవెన్యూ రాని పరిస్థితి
- ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదంటున్న 'రియల్' వ్యాపారులు



పుట్టపర్తి సమీపంలోని ఓ వెంచర్‌లో వేసిన ప్లాట్లు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకూ రిజిస్ట్రేషన్ శాఖ వసూళ్లు ఇలా

కార్యాలయం	లక్ష్యం (రూ.కోట్లు)	వసూళ్లు (రూ.కోట్లు)	గ్రోత్ రేటు
చిలమత్తూరు	28.80	6.33	-9.01
సీకే పల్లి	8.10	1.22	-39.09
ధర్మవరం	54.55	10.31	-10.83
హిందూపురం	68.40	10.76	-21.37
కదిరి	42.65	8.21	-10.48
మడకశిర	12.68	2.73	-9.12
పెనుకొండ	27.54	4.99	-7.48
తనకల్లు	5.52	79	-46.49
బుక్కపట్నం	---	---	-6.96

9 జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

రూ.248 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరం వసూళ్ల లక్ష్యం

రూ.50 కోట్లు నాలుగు నెలల్లో వసూలైన మొత్తం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన వైఎస్ జగన్... సేవలను మరింత చేరువ చేసేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ప్రకటించగానే జిల్లాలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రజలకు పాలన చేరువ కావడంతో పాటు రియల్ ఎస్టేట్‌కు బూమ్ వచ్చింది. భూములకు మంచి రేట్లు రావడంతో వ్యాపారులతోపాటు రైతులు కూడా ఎంతో ఆనందపడ్డారు. జిల్లా అభివృద్ధికి బాటలు పడ్డాయని సంబరపడ్డారు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే జిల్లా వాసుల ఆశలు అడియాసలయ్యాయి. గొడవలు, దాడులతో ఎక్కడికక్కడ జనాలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోనే కూటమి నాయకుల నిర్వాకంతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది.

కొనేవారు లేక...

గడిచిన మూణ్నెళ్లుగా శ్రీసత్యసాయి జిల్లాలో పరిస్థితులు పూర్తిగా మారాయి. రియల్ ఎస్టేట్ రంగంలో క్రయవిక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో భూములు కొనుగోలు చేసిన వాళ్లు... ఇప్పుడు అమ్ముదామంటే కొనేవారు లేక విలవిల్లాడిపోతున్నారు. టీడీపీ నేతలు ఎమ్మెల్యేలుగా గెలిచాక శాంతిభద్రతలు అదుపు తప్పాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో భూముల కొనుగోలుకు సామాన్యులు ముందుకు రావడం లేదు. హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం లాంటి ప్రధాన పట్టణాల్లో కూడా కొనుగోళ్లు స్తంభించాయి. జిల్లాలో 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, అన్నింటా మైనస్ గ్రోత్ రేటు నమోదైంది.

తెరపైకి హిందూపురం..

అసలే అంతంత మాత్రంగా ఉన్న 'రియల్' వ్యాపారం... హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలతో పూర్తిగా పడిపోయింది. జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారుస్తామని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడానికి మరింత దోహదం చేశాయి. స్వయానా సీఎం చంద్రబాబుకు బావమరిది కావడం, హిందూపురానికి ఎమ్మెల్యే అవడం వల్ల జిల్లా కేంద్రం ఆ మూలకు తరలిపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన అందరిలో నెలకొంది. ఇలా ఒకటి కాదు రెండు కాదు రకరకాల కారణాలతో శ్రీసత్యసాయి జిల్లాలో స్థిరాస్తి రంగం దారుణంగా పడిపోయిందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలయ్య వ్యాఖ్యలతో రియల్ ఢాం



జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. ఇందుకు వివిధ కారణాలున్నాయి. హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేస్తామంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అందరినీ గందరగోళంలోకి నెట్టేశాయి. దీంతో కాస్తకూస్తో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. క్రయ, విక్రయాలు బాగా తగ్గాయి. అయినా బాలకృష్ణ చెప్పినంత మాత్రాన జిల్లా కేంద్రం మారిపోదు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయి.

– మారుతీ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి

క్రయ విక్రయాలు తగ్గాయి



జిల్లా కేంద్రాన్ని పుట్టపర్తి నుంచి హిందూపురానికి మారుస్తామని బాలకృష్ణ చేసిన ప్రకటన రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ప్రభావం చూపింది. దీంతో భూముల క్రయ విక్రయాలు బాగా తగ్గాయి. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయడంతో రియల్ వ్యాపారం భారీగా పుంజుకుంది. ప్రస్తుతం నేల చూపులు చూస్తోంది.

– ఘంటసాల సుబ్బరాజగుప్తా, పుట్టపర్తి

అప్రమత్తంగా ఉండండి

- వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
- జిల్లా స్థాయిలో 08885292432 నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్: అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులూ జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శనివారం ఆయన వివిధ శాఖల జిల్లా అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. అల్పపీడనం తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలకు జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులంతా మూడు రోజులు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అలాగే వర్షాల వల్ల కలిగే ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రజలకు సాయం చేసేందుకు 08885292432 నంబరుతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, డివిజన్, మండల స్థాయిలోనూ కంట్రోల రూం ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, వ్యవసాయ, మత్స్య శాఖ, పశుసంవర్థక శాఖ, ఉద్యాన, గృహ నిర్మాణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద మూడు రోజుల పాటు కాపలా ఉంచాలన్నారు. రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో రెవెన్యూ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, పరికరాలు, సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వర్షాల వల్ల ఏవైనా ఇబ్బందులు కలిగితే ప్రజలు కంట్రోల్‌రూం నుంచి తక్షణ సాయం పొందవచ్చన్నారు.

20 మండలాల్లో వర్షం..

తుపాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 20 మండలాల పరిధిలో 122.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బత్తలపల్లి మండలంలో 15.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అమరాపురం మండలంలో 14 మి.మీ, పెనుకొండ 13, అమడగూరు 9.6, తాడిమర్రి 7.8, రామగిరి 7.6, అగళి 6.8, గుడిబండ 6.2, పుట్టపర్తి 6.2, ఎన్పీ కుంట 6, కదిరి 5.2, ఓడీ చెరువు 4.2, మడకశిర 3.6, లేపాక్షి 3.4, ముదిగుబ్బ 3.2, కొత్తచెరువు 2.4, తలుపుల 2.2, తనకల్లు 2.2, గాండ్లపెంట 2, నల్లచెరువు మండలంలో 2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

చొక్కాపట్టుకుని బయటకు గెంటేస్తాం

- ధర్మవరం కమిషనర్ మల్లికార్జునపై పరిటాల శ్రీరాం వివాదాస్పద వ్యాఖ్యలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'ధర్మవరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టాడు. మళ్లీ ఇప్పుడు ప్రభుత్వం ఆయన్ను ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పంపింది. దీన్ని మేం ఎంతమాత్రమూ ఒప్పుకోం. అయితే ఆయన నియామకంపై నిరసన తెలపం, ధర్నాలు చేయం. నేనే సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్తా... కమిషనర్ మల్లికార్జున చొక్కా పట్టుకుని తన్నుకుంటూ బయటకు పంపిస్తా, మున్సిపల్ కార్యాలయానికి తాళం వేస్తా '' అంటూ ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన పరిటాల శ్రీరామ్ ఉద్యోగులపై తమ వైఖరిని చాటిచెప్పారు. మల్లికార్జున మున్సిపల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు టీడీపీ కార్యకర్తలను అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారన్నారు. అలాంటి వ్యక్తిని మళ్లీ ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా నియమించడం తనని కలచివేసిందన్నారు. కాగా, పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగమని..అలాంటి ఉద్యోగులపై దాడులు చేస్తాం..చొక్కా పట్టుకుని గెంటేస్తామని భయపెట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదని పలు ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.

'టోల్' ఫీజు తగ్గించాలి

- జాతీయ రహదారిపై లారీ యజమానుల ధర్నా



టోల్‌గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లారీ యజమానులు

లేపాక్షి: టోల్‌గేట్ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చోళసముద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద లారీ యజమానులు శనివారం ధర్నా చేశారు. 'లోకల్'కు మినహాయింపు ఇవ్వకుండా ఒక్కోలారీకి రూ. 150 చొప్పున టోల్ ఫీజు వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై లారీలు అడ్డంగా పెట్టి సుమారు గంటకుపైగా ధర్నా నిర్వహించారు. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో టోల్‌గేట్ యజమాని స్పందించారు. లారీలో లోడ్ ఉంటే రూ. 100, లోడ్ లేకపోతే రూ.50 చొప్పున వసూలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో లారీ యజమానులు నిరసన విరమించారు.

అభివృద్ధి కనిపించలేదా మంత్రి గారూ?



నాడు-నేడు కింద నిర్మించిన వేదిక ప్రాంగణంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

- టేకులోడు పాఠశాల 'నాడు- నేడు' పనులపై మంత్రి విమర్శలు
- పూసగుచ్చినట్లు వివరించిన ప్రిన్సిపాల్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్

చిలమత్తూరు: బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత శనివారం మండలంలోని టేకులోడు బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. 'నాడు-నేడు' కింద పాఠశాలకు రూ.61 లక్షలు మంజూరయ్యాయని అభివృద్ధి ఎక్కడంటూ ప్రశ్నించారు. అయితే ఆమె నిల్చున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన షెడ్డు, గోడలకు రంగులు, వాకింగ్ ట్రాక్, ఫౌంటెయిన్, తరగతి గదుల ఆధునికీకరణ, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ఆవరణను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తీరు కళ్లముందే కనిపిస్తున్నా... అభివృద్ధి ఎక్కడంటూ ఆమె ప్రశ్నించడంతో ప్రిన్సిపాల్ జయసింహ నాయుడు, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ సోమశేఖర్ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మరోసారి వివరించారు. అయినా వినిపించుకోని మంత్రి... ప్రహరీ ఎందుకు నిర్మించలేదంటూ ప్రశ్నించారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో జాతీయ రహదారి కోసం ప్రహరీని కూల్చేసిన విషయాన్ని అక్కడున్న వారు గుర్తు చేశారు. అంతేకాకుండా పనులు చేపట్టిన ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, ప్రస్తుత కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తానే ప్రహరీ కట్టిస్తానని ఇచ్చి హామీని విస్మరించిన విషయాన్నీ గుర్తు చేశారు. దీంతో ఆ విషయాలు పక్కన పెట్టిన మంత్రి పాఠశాలకు వచ్చే సరుకులు, స్టేషనరీ ఇన్, అవుట్ ఎంట్రీలు లేకపోవడం ఏంటని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిదిద్దుకోవాలని సూచించారు.

ఖాద్రీశా.. కటాక్షించవయా

కదిరి టౌన్: శ్రావణ మాసం చివరి శనివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయమే శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశునికి ప్రత్యేక అలంకరణ చేసిన అర్చకులు వివిధ పూజలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలోనూ భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం



ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

శనీశ్వరా.. కరుణజూపరా



పావగడ: శ్రావణ మాసం.. చివరి శనివారం..అందునా బహుళ శని త్రయోదశి కలిసిరావడంతో శనీశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజామునే ఆలయానికి చేరుకున్న భక్తులు తొలుత దీక్షా మంటపంలో స్వామికి తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని తైలాభిషేకాలు, శీతలాంబదేవికి సహస్ర కుంకుమార్చన చేశారు. అలాగే ప్రత్యేక భవనంలో ఏర్పాటు చేసిన నవగ్రహ పూజల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. రాత్రి జ్యేష్టాదేవి సమేత శనీశ్వరస్వామికి వెండి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సమితి పదాధికారులు, ఆలయ సిబ్బంది, వలంటీర్లు సేవలందించారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి సుమారు లక్ష మంది స్వామి దర్శనానికి వచ్చినట్లు అంచనా వేస్తున్నారు.



వెండి పల్లకీలో ఊరేగుతున్న శనీశ్వరుడు



ఆలయం వద్ద భక్త జన సందోహం (ఇన్‌సెట్) శనీశ్వరస్వామికి ఆకుపూజ నిర్వహించిన దృశ్యం

క్లుప్తంగా

హక్కుల అమలు బాధ్యత యంత్రాంగానిదే



సివిల్‌రైట్స్ డేలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

అమడగూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శనివారం మలకవారిపల్లి తండాలో నిర్వహించిన 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో అణుగారిన వర్గాలైన దళిత, గిరిజనులకు రాజ్యాంగం అనేక హక్కులు కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ హక్కులతో పాటుగా వారి సంస్కృతి, సంప్రదాయాలను కూడా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ రామనాథరెడ్డి, ఏపీఎం గోపాల్, సీఐ నరేందర్ రెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ, సర్పంచ్ లక్ష్మినరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం సబ్‌స్టేషన్‌కు తాళం



సబ్‌స్టేషన్‌కు తాళం వేసిన రైతు నారాయణ

ముదిగుబ్బ: తమ పిల్లలకు నెలల తరబడి జీతం ఇవ్వకపోవడంతో రైతు నారాయణ దొరిగిల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన ఎకరం భూమి ఇస్తే సదరు దాత కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు ఇస్తామని తెలపడంతో నారాయణ ముందుకొచ్చారు. ఆ ఒప్పందం మేరకు భూమి ఇవ్వగా.. వారి ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చారు. ఎన్నికల సమయం నుంచి ఇప్పటి వరకు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారుల నుంచి కూడా సరైన సమాధానం రాలేదు. తమ పిల్లలకు జీతాలైనా ఇవ్వండి.. లేకుంటే సబ్‌స్టేషన్ తొలగిస్తే పంటలైనా సాగు చేసుకుని జీవనం సాగిస్తామని నారాయణ శనివారం సబ్‌స్టేషన్ గేటుకు తాళం వేశాడు. తర్వాత అధికారుల హామీతో తాళం తీసి.. ఆందోళన విరమించుకున్నాడు.

నడ్డి విరుస్తున్న వడ్డీ

- ధర్మవరం పట్టణంలోని చక్రవర్తి థియేటర్ సమీపంలో చేనేత కుటుంబం ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. కారణమేంటని ఆరా తీస్తే.. నూటికి రూ.10 వడ్డీతో తెచ్చుకున్న అప్పులు సమయానికి చెల్లించలేదు. వడ్డీ వ్యాపారులు దౌర్జన్యానికి తాళలేక వెళ్లిపోయినట్లు తేలింది.
- ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీలో తోపుడు బండిపై చికెన్ కబాబ్ వ్యాపారం చేసుకునే నిరుపేద వారానికి రూ.10 వడ్డీ చొప్పున రూ.10వేలు అప్పు తీసుకుని ఏడాది కాలంలో రూ.80 వేలు వడ్డీ రూపంలో చెల్లించాడు. అయినా అసలు మొత్తం చెల్లించలేదని వడ్డీ వ్యాపారులు దౌర్జన్యం చేయడంతో ఎటో వెళ్లిపోయాడు.
- బత్తలపల్లి మండల కేంద్రంలో ఓ పేద కుటుంబం అవసరాల నిమిత్తం గంటాపురానికి చెందిన వడ్డీ వ్యాపారి వద్ద అధిక వడ్డీకి రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. తనఖా కింద స్వంత ఇంటిని తాకట్టు పెట్టాడు. గడువు తీరినా అప్పు చెల్లించలేదని ఇల్లు తన పేరిట రాయాలని వడ్డీ వ్యాపారి వేధిస్తున్నాడు.



ధర్మవరం పట్టణ ముఖచిత్రం



- నూటికి రూ.10 వారపు వడ్డీ
- అప్పు చెల్లించకపోతే దౌర్జన్యం
- పెచ్చుమీరిన వడ్డీ వ్యాపారుల ఆగడాలు
- భయంతో ఊళ్లు వదిలి వెళ్లిపోతున్న నిరుపేదలు

ధర్మవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరినప్పటి నుంచి ధర్మవరం నియోజకవర్గంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం.. చెల్లించని వారిపై దౌర్జన్యాలకు దిగడం ఇక్కడ నిత్యకృత్యమౌతోంది. కొంత మంది కొత్తగా అప్పు చేసి వడ్డీలు కడుతుంటే.. మరికొంత మంది అప్పులు పుట్టక వేరే ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ధర్మవరం పట్టణంలోని ఎల్‌సీకేపురం, బోయవీధి, తారకరామాపురం, చక్రవర్తి థియేటర్ ఏరియా, శివానగర్, శాంతి నగర్, శివారు ప్రాంతాలైన ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్‌కాలనీ, ఎల్1, ఎల్2, కేతిరెడ్డి కాలనీల్లో వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

గత్యంతరం లేకే అప్పులు..

ధర్మవరం పట్టణంలో ఎక్కువ శాతం చేనేత కార్మికులు, రోజువారీ కూలీలు, తోపుడు బండ్ల కార్మికులు జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు ఠంచనుగా అందేవి. దీంతో వారు బయట అప్పు చేసే పరిస్థితి ఉండేది కాదు. ఆరు నెలలుగా సంక్షేమ పథకాలు డీబీటీ ద్వారా రాకపోవడంతో నిరుపేదలు అల్లాడిపోతున్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా ఒకేసారి రూ.24 వేలు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరేవి. కూటమి పాలనలో పింఛన్లు తప్ప వేరే పథకాలు ఏవీ అమలు కాకపోవడంతో పిల్లల చదువులకు, రోజువారీ ఖర్చులకు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.10 వడ్డీకి అప్పు తెచ్చుకుని ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

పెచ్చుమీరుతున్న 'కాల్ మనీ' అకృత్యాలు..

ధర్మవరం పట్టణంలో అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం.. చెల్లించని వారిపై కాల్ మనీ మాఫియా చేస్తున్న అకృత్యాలు పెచ్చుమీరుతున్నాయి. అప్పు చెల్లించని వారి ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం, అక్రమ కేసులు బనాయించడం, ఇళ్లలోకి పందులు వదలడం వంటి చేష్టలకు దిగుతున్నారని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మూడు నెలల క్రితం ఓ యువకుడు అప్పులు ఎక్కువై వడ్డీ చెల్లించలేక కాల్ మనీ మాఫియా దౌర్జన్యాలు సహించలేక దామాజిపల్లి రైల్వేగేట్ వద్ద బలవన్మరణానికి పాల్పడ్డాడు.

మైక్రో ఫైనాన్స్ కంపెనీల ప్రవేశానికి యత్నం..

నియోజకవర్గంలో మైక్రో ఫైనాన్స్ కంపెనీలు సైతం రంగంలోకి దిగేందుకు యత్నిస్తున్నాయి. వీటిని 2012లో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి నియోజకవర్గంలో ఉండకూడదంటూ హెచ్చరించడంతో ఆ కంపెనీలు వెళ్లిపోయాయి. మహిళల అవసరాలను ఆసరాగా తీసుకుని అధిక వడ్డీ వసూలు చేసే మైక్రో ఫైనాన్స్ కంపెనీలు ఇప్పుడు తాజాగా తాడిమర్రి మండల కేంద్రంలో పాగా వేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఇవి పూర్తిస్థాయిలో రంగ ప్రవేశం చేశాయంటే పేదలు మరింత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది.

పోలీసులు ఉక్కుపాదం మోపేరా?..

పేదలను జలగల్లా పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై కొత్తగా వచ్చిన పోలీస్ ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపుతారా.. లేక వారి నుంచి ఆమ్యామ్యాలు పుచ్చుకుని మిన్నకుండిపోతారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ధర్మవరం పట్టణంలోని ఒకటవ, రెండవ పోలీసు స్టేషన్ల పరిధిలో కిందిస్థాయి సిబ్బంది వడ్డీ వ్యాపారులతో బాగా టచ్‌లో ఉన్నారు. ప్రతి నెలా వారికి కొంత మొత్తంలో డబ్బులు ముట్టజెబుతుండటంతో వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి.

దౌర్జన్యం చేసేవారిపై చర్యలు



ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వడ్డీ వ్యాపారుల ఆగడాలపై బాధితులు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సత్వరం స్పందించి వారి ఆటకట్టిస్తాం. చట్టాన్ని ఉల్లంఘించి కార్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు.

– శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం.

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు

- తుపాను నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: తుపాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని అనంతపురం సర్కిల్‌కు చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్స్) వరకుమార్, నెల్లూరుకు సీజీఎం ఆదిశేషయ్య, తిరుపతికి జనరల్ మేనేజర్ రామచంద్రరావు, కడపకు జనరల్ మేనేజర్ మురళి, కర్నూలుకు జనరల్ మేనేజర్ ఇస్మాయిల్ అహమ్మద్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడం కోసం అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిల్చోవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి ఘటనలను గుర్తించినట్లయితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి లేదా టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అలాగే సంస్థ వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

పింఛన్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

- పరిగిలో పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సవిత



పరిగిలో లబ్ధిదారుకు సామాజిక భద్రత పింఛన్ నగదును అందిస్తున్న మంత్రి సవిత

పరిగి: ప్రభుత్వం అందిస్తోన్న సామాజిక భద్రతా పింఛన్లతో నిరుపేదలైన లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం ఆమె పరిగిలో పర్యటించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ మొత్తం పెంచామని, అధికారంలోకి వచ్చి రెండు నెలల్లోపే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అనంతరం మంత్రి పరిగిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించి భోజనం తిని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం మంత్రి సవిత పరిగి పీహెచ్‌సీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వరూపరెడ్డి నీటి సమస్యతో పాటూ ప్రహరీ గురించి మంత్రి సవిత దృష్టికి తెచ్చారు. ఊటుకూరు పీహెచ్‌సీ కొత్తగా మంజూరైనప్పటికీ నిధుల లేమి వల్ల భవనాన్ని నిర్మించుకోలేకపోయామని, ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వైద్యాధికారి డాక్టర్ రూబి మంత్రిని కోరారు. మంత్రి వెంట తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, హౌసింగ్ ఏఈ సునీత, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణ, బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మన్ను తింటూ నిరసన తెలుపుతున్న సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

పుట్టపర్తి టౌన్: పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శనివారం కొత్తచెరువులో సత్యసాయి వాటర్ సప్లయ్ కార్మికులు వేతనాలు అందలేదని మన్ను తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 534 మంది కార్మికులు 900 గ్రామాలకు తాగు నీరు అందిస్తున్నారని, ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సత్యసాయి వాటర్ ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. 10 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్ల వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర, కార్మిక సంఘం అధ్యక్షులు ఉపేంద్రకుమార్, కోశాధికారి రాము, కొత్తచెరువు కమిటీ మెంబర్ నాగేంద్రతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

'ఆరోపణలున్న వారికి పదవులు సిగ్గుచేటు'

అనంతపురం సెంట్రల్: అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లుగా నియమించడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2015–18లో జేఎన్‌టీయూ కలికిరి పరిధిలో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ కృష్ణయ్యను ఇటీవల జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ఎలా పదవి ఇస్తారని ప్రశ్నించారు.

సేల్స్‌ఫోర్స్ కోర్సుతో ఉద్యోగాల విప్లవం



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ప్రసంగిస్తున్న ట్రైల్ బ్లేజర్ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: సేల్స్ ఫోర్స్ కోర్సుతో ఉద్యోగాల విప్లవం సాధ్యమవుతుందని బెంగళూరు ట్రైల్ బ్లేజర్ గ్రూప్ సభ్యులు శేషగిరి తమలల్ల, ప్రొడక్ట్ స్పెషలిస్ట్ చైత్ర, సేల్స్‌ఫోర్స్ డెవలపర్ అక్షయ్‌వాసు అన్నారు. శనివారం పుట్టపర్తి సమీపంలో ఉన్న సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌తో ట్రైల్ బ్లేజర్ కమ్యూనిటీ గ్రూప్‌తో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సెమినార్ హాలులో ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై, సేల్స్ ఫోర్స్‌లో వచ్చే అవకాశాలపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ట్రైల్ బ్లేజర్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో సేల్స్‌ఫోర్స్ కోర్సు, క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ కోర్సును పూర్తి చేస్తే విదేశాల్లో సైతం ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. సేల్స్‌ఫోర్స్ ప్రధాన కార్యాలయం శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండగా ఇజ్రాయిల్, లండన్, హాంకాంగ్, ప్యారిస్, సిడ్నీ, టోక్యో తదితర చోట్ల 110 కార్యాలయాలు ఉన్నాయని వివరించారు. ఇందులో 72,682 మంది పని చేస్తున్నారన్నారు. అటువంటి సంస్థతో రాష్ట్రంలో మొదటి సారిగా ఎంఓయూ కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందని 'సంస్కృతి' చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సేల్స్‌ఫోర్స్ డెవలపర్ ఓరియంటేషన్ కార్యక్రమంలో సీనియర్ సేల్స్‌ఫోర్స్ డెవలపర్ సురేష్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్రావణి, లీడ్ ఇంజినీర్ సహానా, పవన్‌కుమార్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- సింగిల్ విండో విధానంలో మండపాలకు అనుమతి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరిక

పుట్టపర్తి టౌన్: గణేష్ ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటు, అనుమతులు...విధివిధానాలను శనివారం ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారంతా తప్పనిసరిగా నిబంధనలన్నీ పాటించాలని, ఎవరైనా గీత దాటితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గణ మండపాలకు అనుమతులు సులభతరం చేసేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానం అమలు చేస్తోందన్నారు. మండపాల నిర్వాహకులు తొలుత 7995095800 నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపితే .. అనుసరించాల్సిన విధివిధానాలు వాట్సాప్‌కు వస్తాయన్నారు. మండపాల అనుమతి కోసం www.ganeshutsav.net ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత మీ–సేవ ద్వారా చలానా కడితే అధికారులు ఎన్‌ఓసీ పత్రం, క్యూఆర్ కోడ్ పంపుతారన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ను ప్రతి మండపంలోనూ తప్పనిసరిగా ఉంచాలన్నారు.



అమడగూరు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

అమడగూరు: బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పోలీసులు స్పందించాలని ఎస్పీ రత్న సూచించారు. శనివారం ఆమె అమడగూరు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, రిసెప్షన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేసి చోరీలు నివారించాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిరంతరం నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్పీ వెంట సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించాలి..

గణేష్ మండపం వద్ద నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా టపాసులు, అగ్నికి ఆహుతి అయ్యే వస్తువులు ఉంచకూడదన్నారు. ఇసుక బస్తాలు, నీటి బకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో ప్రతి మండపం వద్ద ముగ్గురు వలంటీర్లు ఉండాలన్నారు. వాహన పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. అనుమానాదస్పద వ్యక్తులు, వాహనాలు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి తర్వాత లౌడ్ స్పీకర్లు ఉపయోగించకూడదన్నారు.

– రత్న, ఎస్పీ



సంగీత విభావరి నిర్వహిస్తున్న భక్తులు



'పరిపూర్ణ మహావతారి' నృత్య రూపకంలోని ఘట్టాలు



నయనానందకరం.. నృత్య వైభవం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవం వివరిస్తూ చిన్నారుల నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన శ్రీ సత్యసాయి జిల్లా భక్తులు శనివారం సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయిని కొనియాడుతూ సాయి గాన సౌరభం పేరుతో సంగీత విభావరి నిర్వహించారు. చక్కటి స్వరాలతో భక్తిగీతాలు ఆలపిస్తూ నిర్వహించిన సంగీత కచేరితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. సాయంత్రం సత్యసాయి అవతావర వైభవాన్ని వివరిస్తూ బాలవికాస్ చిన్నారులు 'పరిపూర్ణ మహామతారి' నృత్యరూపకం ప్రదర్శించారు. సందేశాత్మకంగా నిర్వహించిన నృత్యరూపకంతో భక్తులు మైమరచిపోయారు.